# సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025






అరకు చలి ఉత్సవ్ వేళ.. ఆనంద హేల IIలో



శ్రీవారిని దర్శించుకున్న నితీశ్‌కుమార్ రెడ్డి IIలో



నూతన వైద్య విధానాలతో మెరుగైన వైద్యం IIలో

## 5న 'వైఎస్సార్ సీపీ ఫీజు పోరు'

### పోస్టర్ ఆవిష్కరించిన గుడివాడ అమర్‌నాథ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ హరివెంకట కుమారి, సమన్వయకర్తలు అదీప్‌రాజ్, దేవన్‌రెడ్డి, ముఖ్య నేతలు

సాక్షి, విశాఖపట్నం: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న 'వైఎస్సార్ సీపీ ఫీజు పోరు' నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి 'వైఎస్సార్ సీపీ ఫీజు పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,800 కోట్ల విద్యా దీవెన, రూ.1,100 వసతి దీవెన బకాయిలు ఉన్నాయని తెలిపారు. గడిచిన ఎనిమిది నెలలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులపై ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు మానసికంగా ఆవేదన చెందుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేలా వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న ఫీజు పోరును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేంతవరకు వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, తైనాల విజయ్‌కుమార్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవి రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచందర్, జిల్లా అనుబంధ విభాగల అధ్యక్షులు బోని శివరామకృష్ణ, పేడాడ రమణికుమారి, దొడ్డి కిరణ్, సనపల రవీంద్ర భరత్, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, పులగమ కొండారెడ్డి, కార్పొరేటర్లు పీవీ సురేష్, ఇమ్రాన్, జానకీరాం, బిపిన్ జైన్, ముఖ్యనాయకులు డాక్టర్ జహీర్ అహ్మద్, అల్లంపల్లి రాజుబాబు, బయ్యవరపు రాధ, మహ్మద్ షరీఫ్, ద్రోణంరాజు శ్రీ వత్సవ్, పి.వి నారాయణ, గణేష్ గౌడ్, మల్లేశ్వరి, దేవరకొండ మార్కండేయులు, జగపల్లి నరేష్, రాము బంగారు భవానీశంకర్, పులగమ శ్రీనివాస్ రెడ్డి, పులగమ సూర్యనారాయణ రెడ్డి, పీతల వాసు తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగులు, మహిళలకు ఆశాజనకంగా..



ఎంఎస్‌ఎంఈ రంగానికి చేయూతనిస్తూ, ఎగుమతుల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యతనివ్వడం ప్రశంసనీయం. క్రెడిట్ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, స్టార్టప్‌లకు రూ.10 కోట్లకు పెంచడంతో పాటు వృద్ధిలో ఉన్న ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారులకు టర్మ్ లోన్‌ను రూ.20 కోట్లకు పెంచడంతో ఈ రంగాలకు పెట్టుబడి, వర్కింగ్ క్యాపిటల్ బలోపేతమవుతాయి. యువతను సన్నద్ధం చేసేలా 5 నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు అభినందనీయం. గ్లోబల్ స్కిల్లింగ్ భాగస్వామ్యాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏఐ ఏర్పాటు ఉండటం నిరుద్యోగులు, మహిళలలో నైపుణ్యాన్ని పెంచుతుంది. – కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ ప్రెసిడెంట్

### రెండు దశాబ్దాల తర్వాత గణనీయమైన సవరణ



దాదాపు 20 ఏళ్లలో మొదటిసారిగా వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబ్‌లలో గణనీయమైన సవరణను సూచించారు. ఈ నిర్ణయంతో ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైందిగా నిలిచిపోతుంది. ఇది మధ్య తరగతికి ఒక పెద్ద ప్రోత్సాహకం. ఈ పన్ను ఆదా ప్రజలు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడంలో సహాయ పడటమే కాకుండా ఎక్కువ ఆర్థిక సౌలభ్యాన్ని కూడా ఇస్తుంది. వ్యవసాయ రంగానికి అనేక ప్రగతిశీల కార్యక్రమాలు ప్రవేశపెట్టడం ప్రశంసనీయం.

–సుధీర్ ములగాడ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈసీ సభ్యుడు

### మధ్యతరగతి,గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం



బడ్జెట్ మధ్య తరగతి, గ్రామీణాభివృద్ధికి గణనీయమైన ప్రయోజనాలను అందించనుంది. జీడీపీ వృద్ధికి దోహద పడుతోంది, వ్యవసాయ రంగంలో సంస్కరణలు కాలక్రమేణా స్థిరమైన ప్రయోజనాలను అందించనున్నాయి. బీమా రంగంలో ఎఫ్‌డీఐని 100శాతానికి పెంచడం వల్ల మరిన్ని విదేశీ కంపెనీలను ఆకర్షించే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు బీమా సౌకర్యం మరింత అందుబాటులోకి రానుంది.

–పైడా కృష్ణప్రసాద్, పారిశ్రామిక రంగ నిపుణుడు





### విద్యకు పెరగని కేటాయింపులు



ఈ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయం. కొఠారి కమీషన్ సూచనల ప్రకారం కనీసం 6 శాతం నిధులు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంది. పాఠశాల విద్యా ప్రస్తుత స్థితిగతుల గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించింది. రానున్న ఐదేళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ.. సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టం ఇవ్వలేదు.

– ఏఎస్ నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏపీటీఎఫ్–1938

# ఆశ నిరాశ

## కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి

- మెట్రో ఊసే లేదు.. 'జోన్' కూత వినిపించలేదు
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపు
- ప్యాకేజీ నిధుల్లో భాగంగానేకొంత విదిలింపు
- అన్ని పోర్టులతో పాటు వైజాగ్ పోర్టుకు రూ.730 కోట్లు
- షిప్‌యార్డుకు రూ.150 కోట్లు
- ఇవి మినహా.. పద్దులో విశాఖ ప్రస్తావన శూన్యం
- ఆదాయపు పన్ను వర్గాలకు కాసింత ఊరట

సాక్షి, విశాఖపట్నం: కర్షక, పారిశ్రామిక, మధ్య తరగతి వర్గాలను కాస్తా ఊరడించేలా.. పద్దు లెక్కలు చదివిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. విశాఖను మాత్రం పూర్తిగా విస్మరించారు. డీపీఆర్ ఇచ్చినా.. వైజాగ్ మెట్రో ఊసే లేదు.. రైల్వే జోన్ ప్రస్తావన లేదు.. అంతెందుకు విశాఖ పేరు కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం జిల్లా ప్రజల్నే విస్మయానికి గురిచేసింది. కేవలం ఉద్యోగుల్ని ఊరడిస్తూ.. పన్ను చెల్లింపుదారుల్ని పలకరిస్తూ.. రైతులకు భరోసా ఇస్తూ.. యువతకు నైపుణ్యం అందించేలా చెయ్యందిస్తూ.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ.. సాగిన సుదీర్ఘ ప్రసంగం వల్ల విశాఖకు ఒనగూరిన ప్రయోజనాలేవీ కనిపించలేదంటూ ప్రతి ఒక్కరూ పెదవి విరుస్తున్నారు. అయితే స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు, హిందూస్థాన్ షిప్‌యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం రూ.150 కోట్లు కేటాయించారు. దేశంలోని మేజర్ పోర్టులకు కేటాయించిన మాదిరిగానే విశాఖ పోర్టు అథారిటీకి రూ.730 కోట్లు విదిలించారు.

### ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సాహించేలా..



వినియోగ ఆధారిత వృద్ధి, సులభతర వ్యాపారం, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈలు, ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించినట్లు బడ్జెట్‌లో స్పష్టమవుతోంది. 49 శాతం ప్రభుత్వ సహకారంతో రూ.25,000 కోట్ల సముద్ర అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయడం అద్భుతమనే చెప్పొచ్చు. ఎంఎస్‌ఎంఈలకు చేయూతనందించేలా పెట్టుబడి, టర్నోవర్ పరిమితులను వరుసగా 2.5, 2 రెట్లు పెంచడం చూస్తే.. అనేక ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉంది.

– శ్రీనాథ్ చిట్టూరి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జోన్ చైర్మన్

### ఎంఎస్‌ఎంఈలకు చేయూత

ఎంఎస్‌ఎంఈలపై బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. ఎంఎస్‌ఎంఈ రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు పెంచారు. తయారీ రంగంలో 36 శాతం వాటా ఉన్న ఎంఎస్‌ఎంఈలకు ఈ రుణ పరిమితి పెంపు పెద్ద ఊరటనిచ్చే అంశమని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 4450 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఉండగా 14,639 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇందులో దాదాపు 70 శాతం ఎంఎస్‌ఎంఈలు లబ్ధి పొందే అవకాశాలున్నాయి. గతంలో రూ.కోటి వరకూ ఆడిట్ లేకుండా ఉండగా.. ఇప్పుడు రూ.5 కోట్ల వరకూ ఆడిట్ లేకుండా చేయడంతో మధ్య తరహా పరిశ్రమలు స్వల్పంగా లాభపడతాయి.

### ఉక్కు కేటాయింపులు.. ఆ నిధుల్లో భాగమే.?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే ఈ కేటాయింపులు ఏ ప్రాతిపదికన ఇస్తున్నారనే దానిపై అందరిలోనూ సందిగ్ధం నెలకొంది. ఇటీవల ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిధుల్లో భాగమే ఈ కేటాయింపులు చేశారే తప్ప.. కొత్త కేటాయింపులు కాదని స్టీల్‌ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే తొలివిడత కింద కొద్ది నెలల క్రితం రూ.1640 కోట్లు ఇవ్వగా.. తాజాగా శుక్రవారం రాత్రి మరో రూ.6,783 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడు మరో రూ.3,295 కోట్లు కేటాయింపులు చేశారు. ఇవి ఈ ఆర్థిక సంవత్సరం లోపు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నిధులతో ప్లాంట్ ఎలా ముందుకు దూసుకెళ్లగలదని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

### వాల్తేరు డివిజన్‌కు అతీగతి లేదు

విశాఖ రైల్వే జోన్‌కు దాదాపు నెల రోజుల క్రితం ప్రధాని మోదీ వైజాగ్ వచ్చి మరీ శంకుస్థాపన చేశారు. కానీ.. బడ్జెట్‌లో జోన్ పనులకు సంబంధించిన ప్రస్తావనే తీసుకురాలేదు. వాల్తేరు డివిజన్ కొనసాగింపు గురించి కూడా అతీగతి లేదన్నది బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైంది. జోన్ ప్రకటించి ఐదున్నరేళ్లు గడిచినా.. ఆచరణలో మాత్రం అడుగు పడేందుకు ఇంకొంత సమయం వేచి ఉండాల్సిందేనని కేంద్ర మంత్రి సీతారామన్ చెప్పకనే చెప్పేశారు.

### మెట్రో గాలికేనా.?

విశాఖ నగరానికి మెట్రో కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ని 2024 జనవరిలో కేంద్రానికి పంపించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త డీపీఆర్‌ని కూడా సిద్ధం చేసేసింది. మెట్రో రైలు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా విదిలించకపోవడం అందర్నీ ఆగ్రహానికి గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుపై ముందుకెళ్తున్నామని చెబుతున్నా.. కేంద్రంపై మాత్రం ఒత్తిడి తీసుకురాలేదని బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైందని అన్ని వర్గాలూ పెదవి విరుస్తున్నాయి.

## పింఛను కష్టాలు ఇన్నిన్ని కాదయా.!



పెదజాలరిపేట సచివాలయం వద్ద పింఛన్‌దారులు



శివశక్తినగర్‌లో సద్గురు సాయినాథకాలనీ వద్ద ఒకే చోట పెన్షన్‌లు ఇస్తున్న సచివాలయ సిబ్బంది

మహారాణిపేట: పింఛన్ల పంపిణీ సమయంలో వృద్ధులు, వితంతువుల కష్టాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు లబ్ధిదారులు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వలంటీర్లు వచ్చి పింఛన్లు పంపిణీ చేసేవారు. కానీ, ఈ ప్రభుత్వంలో అందరినీ ఒక చోటకు చేర్చి అందిస్తుండటంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. పెదజాలరిపేట, మధురవాడలోని శివశక్తినగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఈ పరిస్థితి కనిపించింది. సాంకేతిక సమస్యతో నగరంలోని పలుచోట్ల మధ్యాహ్నం 12 గంటల వరకు పంపిణీ జరగలేదు. పెదజాలరిపేట సచివాలయానికి 12 గంటల తర్వాత వెల్ఫేర్ అసిస్టెంట్ వచ్చి పింఛన్లు అందజేశారు. శనివారం రాత్రి 7 గంటల సమయానికి 1,52,835 మందికి రూ. 66.74 కోట్లు అందజేశారు. జిల్లాలో మొత్తం 1,60,757 పింఛన్‌దారులు ఉండగా, ప్రభుత్వం రూ. 69,74,77,500 విడుదల చేసింది. తుది సమాచారం మేరకు జిల్లాలో 95.07 శాతం మందికి పింఛన్లు అందజేశామని, మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

## వాల్తేర్ డివిజన్‌కు ఆరు అవార్డులు



ఆరు షీల్డ్‌లతో ఆయా విభాగాల అధికారులు, డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ

తాటిచెట్లపాలెం: రైల్ వీక్ వేడుకల్లో వాల్తేర్ డివిజన్‌కు ఆరు అవార్డులు లభించాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం భువనేశ్వర్‌లో జరిగిన విశిష్ట రైల్ సేవా పురస్కార్–2024లో ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ చేతుల మీదుగా సంబంధిత అవార్డులను, షీల్డ్‌లను ఆయా విభాగాల అధికారులు అందుకున్నారు. జోన్ పరిధిలో మొత్తం 49 మంది సిబ్బంది వ్యక్తిగతంగా అవార్డులను అందుకోగా.. వీరిలో వాల్తేర్ డివిజన్‌కు చెందిన 16 మంది సిబ్బంది ఉన్నారు. వాల్తేర్ డివిజన్ వివిధ విభాగాల్లో చూపించిన అత్యుత్తమ పనితీరుకు గాను ఆరు షీల్డ్‌లను అందుకుంది. కమర్షియల్ బ్రాంచ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, సెక్యూరిటీ బ్రాంచ్, స్టోర్స్ డిపో, ట్రాక్ మెషీన్ డిపో, మెడికల్ బ్రాంచ్‌లకు ఉత్తమ షీల్డ్‌లు దక్కాయి. మెడికల్ బ్రాంచ్‌కు భువనేశ్వర్‌తో కలిపి సంయుక్తంగా షీల్డ్ దక్కింది. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులతో కలిసి వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ పాల్గొన్నారు.

### రియల్ ఎస్టేట్ రంగం మరికొంత ఆశించింది

కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన, సుస్థిర పట్టణాభివృద్ధికి పెద్దపీట వేశారు. రియల్ ఎస్టేట్ రంగం గురించి మరికొంత ఆశించామని, సరసమైన గృహాలకు ఎక్కువ ప్రోత్సాహకాలు, పెరిగిన ఇంటి రుణాలపై వడ్డీ మినహాయింపు ఉంటే బాగుండేది. భవిష్యత్తులో దీనిపై నిర్ణయం తీసుకుంటారని విశ్వసిస్తున్నాం. ఆదాయ పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం, అద్దెపై టీడీఎస్‌ను రూ.2.4 లక్షల నుంచి రూ.6 లక్షలు చేయడం శుభపరిణామం.

– క్రెడాయ్ వైజాగ్ చాప్టర్ చైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు, ప్రెసిడెంట్ ధర్మేంద్ర

## ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న లగుడు గోవింద్

ఏయూక్యాంపస్: కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు మొండి చేయి చూపారని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, నిధులు కేటాయింపు గురించి ప్రస్తావనే చేయకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల దృష్ట్యా బిహార్, ఢిల్లీకి మాత్రం ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రెవెన్యూ లోటు నిధుల కేటాయింపులు చేయకపోవడం సరికాదన్నారు. ఆదాయపు పన్ను పరిధిని పెంచడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి నాయకులు సత్యం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఈశ్వరరావు, పైడం నాయుడు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ





రైల్వేస్టేషన్ వద్ద బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సీపీఐ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం అంకెల గారడీ అని, రాష్ట్రానికి మరోసారి 'గుండు సున్నా' చూపించారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా శనివారం రైల్వే స్టేషన్ వద్ద సీపీఐ శ్రేణులు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ప్రధాని విశాఖ పర్యటనలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటన చేశారని, ఇటీవల జోనల్ కార్యాలయం కోసం శంకుస్థాపన కూడా చేశారన్నారు. కానీ, బడ్జెట్‌లో దీనికి ఎలాంటి కేటాయింపులు లేవని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన సమయంలో చేసిన వాగ్దానాల అమలుకు నిధులు కేటాయించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని, దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని గానీ, సెయిల్‌లో విలీనం చేస్తామని గానీ ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్ అని అన్నారు. ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు కేంద్రాన్ని ప్రశ్నించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం. మన్మథరావు, ఆర్.శ్రీనివాసరావు, నాయకులు జి. కాసులు రెడ్డి, బి. పుష్ప, కె.రాధ, ఎ.దేవుడమ్మ, ఎ.ఆదినారాయణ పాల్గొన్నారు.

### విమానాల రాకపోకలకు అంతరాయం

గోపాలపట్నం: పొగమంచు కారణంగా శనివారం విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో విశాఖ నుంచి వెళ్లాల్సిన ఒక విమానం రద్దు కాగా.. మూడు విమానాలు ఆలస్యంగా నడిచాయని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.ఉదయం 8.55 గంటలకు చెన్నై వెళ్లాల్సిన ఇండిగో విమానం 10 గంటలకు, ఉదయం 9గంటలకు ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో విమానం 9.40 గంటలకు, ఉదయం 9.55 గంటలకు విజయవాడ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం10.30 గంటలకు బయలుదేరాయి. ఉదయం 8.35 గంటలకు విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానం రద్దయింది.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ప్రతీ సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, అప్పటి వరకు ఈ కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు.

## ఎన్నో జ్ఞాపకాలు.. ఇంకెన్నో అనుభూతులు

### అట్టహాసంగా ప్రారంభమైన భీమిలి ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు మోహనరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



తరగతి గదిలో సందడి చేస్తున్న భీమిలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ఆవరణలోని జూనియర్ కళాశాల మైదానంలో వేదిక ఏర్పాటు చేయగా, పలు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల రోజుల్లోని సరదాలు, ఆటలు, ఉపాధ్యాయులతో అనుబంధం, స్నేహితులతో కలిసి చేసిన అల్లరి ఇలా ఎన్నో జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదులను, ఆట స్థలాన్ని, గ్రంథాలయాన్ని సందర్శించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు పాటలు పాడి అలరించారు. బాలికలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను పూర్వ విద్యార్థులైన జార్ఖండ్ ఐజీ క్రాంతి కుమార్, ఇన్‌కం ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ మహీధర్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐజీ క్రాంతి కుమార్ మాట్లాడుతూ అప్పటి ఉపాధ్యాయులు బాగా బోధించారని, తద్వారా బాగా చదువుకోవడానికి తనకు మంచి అవకాశం లభించిందన్నారు. తన తండ్రి ఇక్కడే ఉపాధ్యాయుడిగా పని చేశారని గుర్తు చేశారు. తన అక్కలు, చెల్లెలు ఇక్కడే చదివారని, వాళ్లందరూ ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారని చెప్పారు. చక్కని క్రమశిక్షణ, ఉపాధ్యాయుల సహకారంతో తామంతా ఎదిగామని, ఈ పాఠశాల తమకు దేవాలయం అని చెప్పారు. మంచి స్నేహితులు ఉండడం తన అదృష్టమన్నారు. ఏటా 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. అడిషనల్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ ఎం.మహీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా బోధన ఉంటుందని, తామందరం ఇక్కడ చదివిన వాళ్లమేనన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతో ఈ స్థాయిలో ఉన్నామని, విద్యార్థులు బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు.

**మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలి**

ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాలను ప్రభుత్వ పరంగా మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాదు అప్పలనాయుడు అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గంటాను కోరారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు పి.వి.జె.మోహనరావు, ఎమ్మెల్యే గంటాను సత్కరించారు. చిన్నబజారు, పెద్ద బజారు మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి మైలిపల్లి లక్ష్మణరావు, ముఖ్య సభ్యులు మైలపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, ఎం.వి.పార్వతీశం, రాజేటి బసవకృష్ణమూర్తి, కె.ముత్యాలరావు, టి.భీమారావు పాల్గొన్నారు.

### 4న ఏయూ రీషెడ్యూల్ పరీక్షలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో జనవరి 8న జరగాల్సిన పరీక్షలను రీ షెడ్యూల్ మేరకు ఈ నెల 4న నిర్వహిస్తామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ సెమిస్టర్ హానర్స్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఈ నెల 4న ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు జరుగుతుందన్నారు. మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, అదే విధంగా రీ అడ్మిట్ అభ్యర్థులకు అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

### ఏయూలో ఎంబ్రియాలజీ కోర్సులో ప్రవేశాలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో 2 సంవత్సరాల మాస్టర్ ఆఫ్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సు, ఏడాది వ్యవధితో పీజీ డిప్లమో ఇన్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సు (సెల్ఫ్ సపోర్ట్ స్పెషలిజ్డ్ ప్రోగ్రామ్స్)ల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడులైంది. వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ప్రవేశాల కోసం అర్హత గల అభ్యర్థులు ఈ నెల 3 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు వెబ్‌సైట్ www.lifeivftraining.com సందర్శించాలని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డి.ఎ.నాయుడు సూచించారు.

## కైలాసగిరిపై టాయ్ ట్రైన్ తాత్కాలిక నిలిపివేత

**ఆరిలోవ:** కైలాసగిరిపై వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న దర్శన్ టాయ్ ట్రైన్(సర్క్యూట్ ట్రైన్) మరమ్మతులకు గురైంది. ఈ కారణంగా ఆదివారం నుంచి ఈ ట్రైన్‌ను నిలిపివేస్తున్నట్లు వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల అనంతరం తిరిగి ప్రారంభిస్తామని, సందర్శకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## మరబోటుకు ట్రాన్స్ పాండర్స్ తప్పనిసరి

**మహారాణిపేట:** ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇప్పటివరకు 586 మర బోట్లకు ట్రాన్స్ పాండర్స్ అమర్చినట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. మిగిలిన బోట్లకు కూడా ఈనెల 7వ తేదీలోపు తప్పనిసరిగా ట్రాన్స్‌పాండర్స్ అమర్చుకోవాలని పేర్కొన్నారు. సముద్రంలో వేట చేస్తున్న సమయంలో స్థానాన్ని గుర్తించడం, సమాచారం తెలుసుకోవడం , భద్రత, రక్షణ అవసరాల దృష్ట్యా నూరు శాతం సబ్సిడీతో మత్స్యశాఖ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. అవసరమైన వారు మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని సంప్రదించాలన్నారు.

## ప్రశాంతంగా ఎథిక్స్ పరీక్ష

**విశాఖ విద్య:** ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో గుర్తింపు గల 188 కాలేజీల్లో ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులంతా తప్పనిసరిగా పరీక్ష రాసేలా అధికారులు శ్రద్ధ తీసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహణపై ఆర్ఐవో పి.మురళీధర్, డీవీఈవో బి.రాధ ఎప్పటికప్పుడు జిల్లాలోని కాలేజీల ప్రిన్సిపాళ్లతో వెబెక్స్ ద్వారా సమీక్షించి, తగు సూచనలు ఇచ్చారు.

## ప్రజాదర్బార్ తాత్కాలికంగా రద్దు

**విశాఖ సిటీ:** వీఎంఆర్డీఏలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.



# ఉత్సవ్ వేళ.. ఆనంద హేల

- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కిటకిటలాడిన సందర్శిత ప్రాంతాలు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు


సంగాలి నృత్యంతో అలరించిన గిరిజన మహిళలు


నృత్యం చేసిన చిన్నారులతో కలెక్టర్ దినేష్‌కుమార్


కుటుంబ సభ్యులతో విహారానికి వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్


గిరిజన మ్యూజియంలో ఫ్లవర్ షో స్టాళ్లు

**అరకులోయ టౌన్/ డుంబ్రిగుడ:** అరకు చలి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం నిర్వహించిన కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొదటి రోజు కన్నా భారీగా జనం తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం నిండిపోయింది. పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్‌కు విశేష స్పందన లభించింది. హెలికాప్టర్‌లో విహరించి అరకు అందాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. పూలతో రూపొందించిన నెమలి, ఏనుగు నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటి వద్ద ఫొటో లు, సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవ వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సందర్శించారు. రాష్ట్ర చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

**సైక్లింగ్‌లో అపశ్రుతి :** ఉత్సవాల్లో భాగంగా బొర్రా నుంచి అరకులోయ వరకు నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విజయనగరానికి చెందిన అభిషేక్, ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే అభిషేక్‌ను 108 వాహనంలో అనంతగిరి ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. హెలీరైడ్‌కు రూ.4 వేలు తీసుకుని నాలుగు నిమిషాలు మాత్రమే తిప్పుతున్నారని పర్యాటకులు అసంతృప్తికి గురయ్యారు. కనీసం పది నిమిషాలైనా విహరించే అవకాశం కల్పిస్తే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు. చెక్క భజన బృందం, అరకు చొంపి గిరిజనుల థింసా నృత్యాలు, శ్రీకాకుళం తప్పెట గుళ్లు, పార్వతీపురం మన్యం జిల్లా నందికొట్ట ప్రదర్శన, డుంబ్రిగుడ బ్యాండ్‌మేళా, ప్రకాశం జిల్లా సంగాలి డ్యాన్స్, సూఫీ డాన్స్, మిశ్రం డాన్స్, కామెడీ స్కిట్, వందేమాతరం శ్రీనివాస్ సినీ గేయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

### విశాఖలో 'అరకు చలి ఉత్సవం'

**కొమ్మాది:** అరకు చలి ఉత్సవాల్లో భాగంగా శనివారం విశాఖ తీర ప్రాంతాల్లోని నోవాటెల్, గ్రాండ్ బే, షెరటాన్, ద పార్క్, రాడిసన్‌బ్లూ తదితర స్టార్ హోటళ్లలో గిరిజన కళాకారులు సందడి చేశారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాకారులు ప్రదర్శించిన కొమ్ము కోయ నృత్యం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖలోని హోటళ్లలో ఈ ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు టూరిజం ఫోరం అధ్యక్షుడు పవన్ కార్తీక్ తెలిపారు.

## సబ్బవరంలో 224 కిలోల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి, నిందితులతో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ పిన్నింటి రమణ

**సబ్బవరం:** అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద రూ.11.20 లక్షల విలువ చేసే 224 కిలోల గంజాయిని శనివారం సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. సీఐ పిన్నింటి రమణ ఆదేశాల మేరకు ఎస్ఐ సింహాచలం, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణు స్వరూప్, సీఐ పిన్నింటి రమణతో కలిసి ఈ కేసు వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద ఎస్ఐ సింహాచలం, సిబ్బందితో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న వ్యానును ఆపి తనిఖీ చేయగా, ఐరన్ లోడ్ కింద 108 గంజాయి ప్యాకెట్లు ఉంచి, టార్పాలిన్ కప్పి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.224 కిలోల గంజాయిని వాహనంలో ఉన్న ఐదుగురు వ్యక్తులు ఆనందపురంలో లోడ్ చేసి.. మహారాష్ట్రలోని కోల్హాపూర్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారి వద్ద నుంచి రూ. 39.62 లక్షల విలువ చేసే గంజాయి, వ్యాన్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగులకు చెందిన డి.రమణమూర్తి, దుర్గాబాలరాజు, మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన అనిల్ సురేష్, కొలాలంపూర్‌కు చెందిన రాహుల్ రాకేష్, సుమిత్, అమిత్ బాటింగ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో 6వ నిందితుడు, వ్యాన్ యజమాని సరజీరావ్ గైక్వాడ్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గంజాయిని పట్టుకున్న సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ సింహాచలం, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

**విశాఖ రైల్వే స్టేషన్‌లో 58 కిలోలు**

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 58 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తన సిబ్బందితో శనివారం స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ప్రసన్ రాజ్, కిశోర్ బలియర్ సింగ్, రాహుల్ పని, పింటు దాస్ వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.2.9 లక్షలు విలువైన 58 కిలోల గంజాయిని సీజ్ చేశారు. విశాఖపట్నం మీదుగా ముంబయికి గంజాయి రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.

## యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడని..

- యువకుడిపై దాడిచేసిన కుటుంబ సభ్యులు
- భయాందోళనతో యువకుడి ఆత్మహత్య?
- గాజువాకలో దారుణం


భాస్కరరావు(ఫైల్)

**అక్కిరెడ్డిపాలెం:** యువతి స్నానం చేస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. ఇది గమనించిన యువతి బంధువులు ఆ యువకుడిపై దాడి చేసి గదిలో బంధించారు. భయాందోళన చెందిన ఆ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా.. తమ కుమారుడిని ఆ యువతి బంధువులు కొట్టి హత్య చేశారని బాధిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన శనివారం గాజువాకలో చోటుచేసుకుంది. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలివీ. విజయనగరం జిల్లాకు చెందిన జి.భాస్కరరావు(30) ఫార్మాసిటీలోని ఓ ఫార్మా కంపెనీలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. గాజువాక శ్రీనగర్‌లోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం ఇంటి యజమానురాలి మనవరాలు ఊరు నుంచి వచ్చింది. పై ఇంట్లో యజమానురాలి బాత్‌రూమ్ కొంత ఓపెన్‌గా ఉంటుంది. శనివారం మనవరాలు స్నానం చేస్తుండగా భాస్కరరావు వీడియో తీస్తున్నాడని బిగ్గరగా అరిచింది. దీంతో భాస్కరరావు అక్కడ నుంచి తన రూమ్‌లోకి వచ్చేశాడు. అక్కడకి వచ్చిన యువతి బంధువులు భాస్కరరావుపై దాడి చేసి అతడి రూమ్‌లోనే బంధించి తాళం వేశారు. వీడియో విషయాన్ని అతడి తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో ఆందోళన చెందిన భాస్కరరావు తన రూమ్‌లోనే కేబుల్ వైర్లతో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విజయనగరంలో ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్న భాస్కరరావు తండ్రి తాతారావు.. తన కుమారుడిని యువతి బంధువులు కొట్టి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో యువతికి సంబంధించిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు ఊతం

**సీఐఐ ఏపీ శాఖ ప్రెసిడెంట్ మురళీకృష్ణ**


మాట్లాడుతున్న సీఐఐ ఏపీ శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీకృష్ణ

**టీచ్‌రోడ్డు:** కేంద్ర బడ్జెట్ ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా భారత్ అవతరించేందుకు దోహదం చేస్తుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఏపీ శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ వున్న మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్థితులను సమూలంగా మార్చేస్తుందన్నారు. ముఖ్యంగా వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే 36 రకాల ఖరీదైన ప్రాణ రక్షక ఔషధాలపై పన్ను మినహాయింపు నివ్వడం అత్యంత మానవీయ నిర్ణయమన్నారు. దేశంలో ఆరోగ్య పరంగా వెనుకబడిన 100 జిల్లాలను గుర్తించి వారికి పౌష్టికాహారం సరఫరా చేయాలని ప్రతిపాదించడం చాలా మంచిదన్నారు. రాష్ట్రానికి ప్రత్యక్షంగా ఎటువంటి కేటాయింపులు లేవని కొంచెం అసంతృప్తిగా ఉన్నా.. పరోక్షంగా రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ దోహదపడుతుందని తెలిపారు. సీఐఐ ఏపీ శాఖ తాజా మాజీ ప్రెసిడెంట్ నీరజ్ సర్దా మాట్లాడుతూ బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈల అభివృద్ధికి పలు సంస్కరణలు ప్రతిపాదించడం వల్ల వాటికి చాలా మేలు జరుగుతుందన్నారు. స్టార్టప్ కంపెనీల పురోగతికి చేసిన ప్రతిపాదనలు వాటి అభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేస్తాయన్నారు. సమావేశంలో ఇండియన్ స్టార్ట్ అప్ కంపెనీల ప్యానల్ మెంబర్ ఫణీంద్ర, సీఐఐ మెంబర్ శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వైద్య విధానాలతో మెరుగైన వైద్యం

**మహారాణిపేట:** ప్రస్తుతం ఆర్థో సమస్యలు పరిష్కరించేందుకు నూతన వైద్య విధానాలతో పాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సకాలంలో మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అందించే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థో రంగ వైద్య నిపుణుడు డాక్టర్ శివశంకర్ అన్నారు. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్రా మెడికల్ కళాశాల, కేజీహెచ్ ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు (ఒసాప్కాన్–2025) మూడో రోజైన శనివారం కొనసాగింది. ఆర్థో వైద్యుడు డాక్టర్ జి.నరసింహారెడ్డి స్మారకార్థం సోలాపూర్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ ఎముకల వైద్యానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య సేవలను వివరించారు. యగ్రీశ్వరుడు స్మారకార్థం డాక్టర్ రాజశేఖరన్ నూతన వైద్య విధానాలు ఉపయోగించి.. ఏ విధంగా ఆర్థో సమస్యలు పరిష్కరించవచ్చో అవగాహన కల్పించారు. అనంతరం పీజీ విద్యార్థులు గోల్డ్ మెడల్ పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సు సందర్భంగా సాయంత్రం ఎంజీఎం పార్కులో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సదస్సు నిర్వాహక చైర్మన్, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్, నిర్వాహక కార్యదర్శులు ఎల్ఎస్ లోకనాథ్, వర్మ, ఆర్థో వైద్యులు వి.వి.కె, రమేష్ సేన్, విజయ్, అశోక్, ప్రదీప్, లీలాప్రసాద్, ప్రొగ్రాం ఇన్‌చార్జి భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టైటిల్ పోరుకు టెన్నిస్ టోర్నీ

**విశాఖ స్పోర్ట్స్:** ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో జరుగుతున్న వెటరన్, చిన్నారుల టోర్నీలు తుది దశకు చేరుకున్నాయి. ఆఫీసర్స్ క్లబ్, స్థానిక క్లబ్‌ల్లో 35+ నుంచి 70+ వరకు ఐదు కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్‌తో పాటు చిన్నారులకు అండర్–12, 14 కేటగిరీల్లో పోటీలు జరుగుతున్నాయి. శనివారం వివిధ కేటగిరీల్లో సెమీఫైనల్స్ పోటీలు ముగియగా, ఆదివారం టైటిల్ పోటీలు జరగనున్నాయి. అండర్–12 బాలుర విభాగంలో కార్తీక్ 7–6తో మనవిపై, బాలికల విభాగంలో సురక్షన్ 7–5తో అస్మిన్‌పై గెలుపొంది తుది పోరుకు చేరుకున్నారు. 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో రేవంత్ 7–4తో దత్రేష్‌పై, బాలికల విభాగంలో పరిణతి 7–3తో కావ్యపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. 35+ సింగిల్స్ ఫైనల్‌లో విజయ్ ఆనంద్‌తో కన్నన్, 45+ సింగిల్స్‌లో రమేష్‌తో ఎం.వి.ఎల్ రాజు తలపడనున్నారు. 55+ సింగిల్స్‌లో మణికన్నన్(తమిళనాడు) 6–1, 6–1తో రావత్(బెంగళూరు)పై విజయం సాధించి రమేష్‌తో ఫైనల్స్‌కు చేరుకున్నారు. 45+ డబుల్స్‌లో కె.బాబ్జీ–ఎంవి రాజు జోడీ విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. 70+ సింగిల్స్‌లో సేతు, 65+ సింగిల్స్‌లో వి.శ్రీనివాస్ విజేతలుగా నిలిచారు. చిన్నారుల పోటీలను కృష్ణంరాజు పర్యవేక్షిస్తుండగా, ఫైనల్స్ ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతాయని టోర్నీ నిర్వాహక కార్యదర్శి డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు

## మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి ప్రతిష్టాత్మక అవార్డు


ఏహెచ్‌పీఐ నుంచి స్వీకరించిన ప్రశంసాపత్రం


మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

**సీతమ్మధార:** మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్–రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంజీసీహెచ్ఆర్ఐ)కు ఏహెచ్‌పీఐ నుంచి పేషెంట్ సెంట్రిక్ ఆర్గనైజేషన్ విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డు లభించడం గర్వకారణమని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. మురళీ కృష్ణ తెలిపారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగి సంక్షేమమే లక్ష్యంగా.. మెరుగైన వసతులు కల్పించి, గౌరవంగా చూసుకుంటూ అత్యుత్తమైన క్యాన్సర్ చికిత్స అందించడంలో బెస్ట్ అవార్డు వచ్చిందని వెల్లడించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం 2025 థీమ్‌కు అనుగుణంగా ఎంజీసీహెచ్ఆర్ఐ రాష్ట్రంలో అగ్రగామి క్యాన్సర్ ఆస్పత్రిగా నిలిచిందన్నారు. ఈ సర్వేలో దక్షిణ భారతదేశంలో 12వ స్థానాన్ని, దేశవ్యాప్తంగా 23వ స్థానాన్ని పొందడం గర్వకారణమన్నారు. సమగ్ర క్యాన్సర్ చికిత్సను అందించడంలో ఎల్లప్పుడూ ముందుంజలో ఉంటామని, మెరుగైన సేవలను అందిస్తూ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా నిరంతరం కృషి చేస్తామని వివరించారు.

## శ్రీవారిని దర్శించుకున్న నితీశ్ కుమార్ రెడ్డి

**కొమ్మాది:** రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం భారత యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారి ఆలయానికి చేరుకుని ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాగరానికి అభిముఖంగా శ్రీవారి ఆలయం ఎంతో అద్భుతంగా ఉందని, ఇక్కడ శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఆయనకు ప్రసాదం అందించారు. టీటీడీ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.

## రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లు కొనసాగించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు

**సీతమ్మధార:** జీవీఎంసీలో మునిసిపల్ కార్మికుల రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లకు కుదించడం సరికాదని, పాత పద్ధతిలోనే 62 ఏళ్లు కొనసాగించాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆప్కాస్ నుంచి ఇటువంటి ఆదేశాలు లేనప్పటికీ గత నెల ఒకటో తేదీ నుంచి జీవీఎంసీలో 60 ఏళ్లు నిండిన 210 మందిని నిలుపుదల చేశారని, శనివారం నుంచి మరికొంతమందిని ఇదే కారణంతో నిలుపుదల చేస్తున్నారని.. ఇది అన్యాయమన్నారు. కార్మికులకు వేతనాలు ఇస్తున్నది జీవీఎంసీ వారేనని, ఇంతవరకూ పారిశుధ్యం, నీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగాలలో 7500 మందిని 62 ఏళ్ల వరకు కొనసాగిస్తూ వచ్చారని చెప్పారు. దీనికి ఆప్కాస్ అభ్యంతరం చెప్పలేదన్నారు. ప్రత్యేకంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ వయసు అన్నది ఎక్కడా నిర్ణయించబడలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఎటువంటి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు గాని చెల్లించటం లేదన్నారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.